ఇక సెలవు

శ్రీ పుల్లాభట్ల నాని

ఆ రాత్రి ఆకాశంలో మేఘాలు దట్టంగా క్రమ్ముకున్నాయి. మధ్య మధ్య ఉరుముల ధ్వనులు భయంకరంగా వినిపిస్తున్నాయి. అగ్నికి ఆజ్యంలా చల్లని రొజ్జగాలి దీనికి తోడైంది. సాధారణంగా అటువంటి వాతావరణంలో ఎవరూ బయటకు రావటానికి సాహసించరు. ప్రకాశంమాత్రం పెరటిలో వాలుకుర్చీమీఁద కూర్చొని దెయ్యాల్లా తిరుగుతున్న మేఘాలను పరికిస్తున్నాడు. చల్ల గాలి బాగా పట్టడానికి అతను చొక్కాగాని, బనియనుగాని తొడుగుకోలేదు. ఆ విధంగానైనా తన ఉడుకు గుండెకు ఉపశమనం కలుగుతుందని అతని భావన.

జీవితమంటేనే, నేఁడతనికి అసహ్యం వేసింది. నాఁటి అతని ఏకాంతవాసమే దానికి కారణం. అప్పుడే మానవునికి విషాదకరమైన విషయాలన్నీ జ్ఞప్తికి వస్తాయి. అటువంటి తరుణాల్లోనే మానసికంగా గాయపడతాడు.

ప్రకాశం ద్వితీయ ప్రపంచసంగ్రామంలో ఘోరముగా పోరాడిన యోధుఁడు. అతను మిత్ర మండలి సేనావాహినిలో ఎన్నికపడసిన వీరుడుగా వివిధ దేశాలను తిరిగేడు. ఐదు సంవత్సరములు, నిమిషం నిలకడలేని ప్రమాదకరమైన జీవితాన్ని గడిపి యుద్ధం పరిసమాప్తి కాఁగానే అధికారుల అనుమతిని స్వీకరించి స్వస్థలానికి తిరిగి వచ్చేడు.

ఒకప్పుడు మేటి వీరుఁడైన ప్రకాశం నేడు ఒక గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నాడు అతను తన యింటిలో గోడలు తప్ప మరి ఓదార్చేవారులేని నిర్భాగ్యుఁడు.

తనకు తండ్రి యెవరో గుర్తుపట్టఁగల యీడు రాకుండానే పేరయ్య చనిపోయేడు. పేరయ్య చాలా బీదకుటుంబీకుఁడు. బంట్రోతు పనిచేస్తూ ఉండేవాడు. పేరయ్య ఒక యేడాదిపాటు తీవ్రమైన వ్యాధితో మంచంపట్టి ఒక నాడు జన్మను చాలించేడు. అతని జబ్బు నయమౌతుందనే ఆశతో పోలమ్మ తన శరీరముపై ఉన్న బంగారం కాస్తా అమ్మి మందులకూ మాకులకూ ఖర్చు చేసింది. ఆఖరికి ఫలితం దక్కలేదు. ఆమె గొల్లుమంది. హృదయం పగిలేటట్లు విలపించింది. ధైర్యాన్నంతా కోల్పోయింది. కాని అడ్డాలలో ఉన్న రెండేళ్ళ బిడ్డనుచూసి ఆమె గుండె దిటవుచేసికోక తప్పలేదు.

ప్రకాశం అచ్చు పేరయ్యరూపే అని ఆమె మురిసిపోయేది. పేరయ్యకు ప్రకాశం అంటే విపరీతమైన అభిమానం ఉండేది. పాపం! తీరా ప్రకాశానికి ఏడాది నిండేసరికి పేరయ్య మంచం ఎక్కేడు. ఈలోగానే రెండు జర్మన్ బొమ్మలు, ఒక బఫూన్‌టోపీ, ఉయ్యాలామంచమూ ఇలాటివేవో ఒకటీరెండూ కొని తెచ్చేడు.

పోలమ్మకి ఆనాడు తనభర్తకు ప్రకాశంమీదగల వ్యామోహం జ్ఞప్తికి వచ్చింది. తనహృదయములో నుంచి పుత్రవాత్సల్యము కట్లుతెగి ప్రవహించింది. అందుకే ఆమె ఆత్మహత్య చేసుకోవాలనే ప్రయత్నం విరమించుకుంది. ప్రకాశరావుని పెంచి పెద్దచేసే బాధ్యతను తన భుజస్కంధములపై ధైర్యంగా వేసుకోగలిగింది.

ఆనాటినుండి పోలమ్మ మరి నవ్వలేదు. ఎప్పుడో ప్రకాశం పెద్దవాడయి తనను నవ్విస్తాడని భావించింది. అప్పటిదాకా తను నవ్వలేననుకుంది. ఆమె ఆ పల్లెటూరి భోజనశాలలోనే వంటపుట్టిగా ప్రవేశించింది. అక్కడ ఇంత భోజనంచేసి వచ్చే అల్పవేతనంతో ప్రకాశానికి ముద్దు ముచ్చటలుతీరుస్తూ భారంగా కాలం గడిపింది.

ప్రకాశం క్రమముగా ప్రాజ్ఞుఁడై స్కూలుఫైనలు పరీక్షలో కృతార్థుఁడయేడు. తరువాత చుట్టుపట్లనున్న నగరాలన్నీ ఉద్యోగార్థియై గాలించేడు. ఉద్యోగం దొరకడం అతనికి సమస్య అయింది.

ప్రకాశం ఒకవంక తల్లిచేసే నీచమైన సేవావృత్తి చూసి సహించలేకపోయేడు. మరొకవైపు తను చిల్లిగవ్వను సంపాదించలేకపోయేడు. ఇఁక చేసేది, ఏమీ లేక తనుగూడా ఒక హోటలులో సర్వరుగా పనిచేస్తూ నీరసంగా కాలం గడుపుతున్నాడు.

ఈవిధంగా మాతాపుత్రులు జీవిస్తూఉండఁగా ఒక నాడు ప్రకాశం తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయేడు. రాఁబోయే మాతృవియోగాన్ని స్మరించుకుని ఖేదపడ్డాడు. అతని కన్నులవెంట అశ్రువులు

రాలేయి. ఏమైనా ఆతను తన మనోభావాలను నిగ్రహించుకుని అంతర్ధానమయేడు.

“ఆనాటికీ, ఈనాటికీ ఏడు సంవత్సరాల అంతరముంది.” అనుకున్నాడు ప్రకాశం. తను మిలటరీ జీవితాన్ని విరమించుకునే నాటికి రెండేండ్లయింది.

స్వస్థలాన్ని చేరుకున్నాక ప్రకాశానికి పోలమ్మ దర్శనం మాత్రం కాలేదు. పోలమ్మ ప్రకాశం యుద్ధం నుండి తిరిగి రాకుండానే చనిపోయింది. ప్రకాశం పెద్దవాడయేడు. ప్రయోజకుడనిపించుకున్నాడు. కాని పోలమ్మ నవ్వవలసిన సమయం రాకుండానే ఎగిరిపోయింది.

ప్రకాశం తిరిగిరాగానే పోలమ్మ మరణవార్తను విని నిలువునా నీరైపోయేడు. వెక్కి వెక్కి ఏడ్చేడు. కొంతసేపుపోయేక గాని తను ఏడుస్తూన్న సంగతి తనకే తెలిసింది కాదు. తరువాత తను ఏడుస్తున్న సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని పొంగిపొరలేదుఃఖాన్ని అతికష్టం మీద తమాయించుకున్నాడు.

అప్పుడు ప్రకాశం ఎందుకు అంతలాగ విలపించేడో యీ నిమిషంలో పరీక్షించుకున్నాడు. రెండు సంవత్సరాల క్రింద తను అనుభవించిన వేదనను ఈ రాత్రి పరిశీలించేడు. తను సంతాపాన్ని సూచించటానికి అర్హుడా! కాదా! అనే విషయాన్ని వితర్కించుకోదలచేడు నేడు అతనియొక్క యోజనలకు పైని ఉరుములుకాని, చలిగాలికాని అంతరాయాన్ని కలించలేదు. ప్రకాశం తనభావాలలో తనే లీనమై పరిసర వాతావరణాన్ని సర్వస్వాన్నీ మఱచిపోయేడు.

సమరభూమిలో లెక్కలేని మానవ కళేబరముల మీదనుంచి తను పురోగమిస్తున్నపుడు తను కించిత్తైనా చలించేడా అంటే, లేదు. కాని వృద్ధురాలైన తనతల్లి మరణించినందుకు చంటిపిల్లవాడిలాగ ఏడ్చేడు. తను ఏకాకినయ్యానని గుండె బాదుకున్నాడు.

ఐతే! తనకు తల్లి మరణించిందని తెలిసి ఏడుస్తున్నపుడైనా ఈవిషయం జ్ఞాపకం వచ్చిందా! పోలమ్మ యింతో అంతో ముసలిదయింది. ఆమెకు ఆయువుచెలి మరణించింది. అంతేగాని ఎవరూ కొట్టలేదు. బలవంతాన చంపలేదు. పైగా ఆమెమీద ఆధారపడేవారు ఇంట్లో ఎవరున్నారు?

మరి యుద్ధంలో చనిపోయినవారో! వారిని చిరంజీవులుగా ఎంతమంది ఆత్మీయతతో యిశనుండి దీవిస్తున్నారో! ఎంతమంది వారిపై ఆధారపడి ఉన్నారో కదా!

యుద్ధంలో ఎంతమంది డాం! అని గుండు దెబ్బకు గురికావటం తను చూసేడు. వారు భూమికి ఒరుగుతూ ఎంతబాధ ననుభవించేరో! ఆ నిమిష కాలంలోనే హా! సర్వేశ్వరా! ఇంక నేపోతున్నాను. ఇంటి దగ్గర నాభార్య అమాయకురాలు. చంటి పిల్లలు. పెళ్ళియీడు చెల్లెలు, చదువుకుంటూన్న తమ్ములు వీరందరికీ యిటుపై నెవరుదిక్కు! ఎవరు దిక్కు? అనే యోచనలు వారి బుర్రలలో గిర్రున తిరుగుతాయి. వారు తాము మరణిస్తున్నామనే భయంకంటె తమ కుటుంబాలకు సంప్రాప్తమవుతూన్న దుస్థితినిగూర్చి ఆ నిమిషం వాపోయి అస్తమిస్తారు.

మానవజీవితపరిభ్రమణం ఎంత విచిత్రంగా ఉంటుంది! వివిధంగా చూసినా మానవుడు మరణానికి గురికాక తప్పదు. అలాంటప్పుడు ఒకరిని ఇంకొకరు చంపుకుని ఎప్పుడో రానున్న వినాశానికి ఇప్పుడే స్వాగతమిచ్చి పున్నమివెన్నెలల వంటి జీవితాలను నిర్ధూమధామం ఎందుకు చేసుకోవాలి? ఈ దేశీయ స్పర్ధలెందుకు; దేశములు పరస్పరము పోట్లాడి ఈ విధ్వంసానికి ఎందుకు దోహదము చేయాలి? అనుకున్నాడు ప్రకాశం.

ప్రకాశం తనతల్లి గతించినప్పుడు ఏడ్చేడు. కాని ఈనాడు అలాగ ఏడ్వడం తనకు భావ్యం కాదనుకున్నాడు. దొంగ ఇంటిలో దొంగతనం జరిగినప్పుడు దొంగ పురరక్షకునికి ఫిర్యాదుచేస్తే ఏమి భావ్యంగా ఉంటుంది? తను ఎంతోమంది మనుష్యులను కాల్చి చంపేడు అనేకమంది మృతజీవులను యుద్ధభూముల్లో చూసేడు. అప్పుడు తనలో ఈ జాలి కరుణ, అవీ యేమయేయి? ఎక్కడ దాగున్నాయి?

ప్రకాశం నవ్వుకున్నాడు. మరణం సర్వజీవసామాన్యమైనది. అది రావలసి వచ్చినప్పుడు ఎవరేమి చేయగలరు. ఎప్పుడో యముడు తన పాశాన్ని వేయవలసిన వారిమీద వదలుతూనే ఉంటాడు. ప్రతీజీవి దానికి లొంగిపోవలసిందే.

ఇంతమాత్రంలో మానవుడు స్వార్థాన్ని పెంచుకుంటున్నాడు. దేశాలు ఒకదానితో ఒకటి పెనుగులాడుతున్నాయి. సమరకేళిల్లో మానవులు శలభాల్లాగ పడి నుసి అవుతున్నారు.

ఇంక మానవుడు నీతిని కోల్పోయి చేసే దౌర్జన్యాలకు అంతూ పంతూ ఉండటంలేదు. అలాంటి ఘాతుక చర్యలను కప్పిపుచ్చేందుకు అంతకంటె ఘోరాలను ఆచరిసాడు. ఇదంతా సంఘంలో మానవుని దుస్థితికి కారణభూతమవుతుంది.

ఇలా ప్రకాశం గతించిన తన చరిత్రలోని పుటలను తిరగవేసి పరిశీలిస్తూ నిద్రపోవుటకు ప్రయత్నిస్తున్నాడు. కాని అతనికి నిద్రపట్టే సూచనలేవీ కనుపించలేదు. అందుచేత లేవఁబోయినవాఁడు మళ్ళీ కుర్చీలోనే కూలఁబడి యింకా ఏదో పాతగతులను పిచ్చిపిచ్చిగా పునశ్చరణ చేసికున్నాడు.

కొంచెంసేపు ఆలోచనలతో గడిపి అతను గంభీరంగా ఒకసారి నవ్వేడు. తరువాత తనలో తనే అనుకున్నాడు.

"ప్రకాశం మాత్రం ఎవ్వరికీ పల్లెత్తు ఉపకారం చేయలేదు. పైఁగా ఒక అర్ధదశ మారణహోమం చేసేడు. అయినా వానిలోని దౌర్జన్యాన్ని వాఁడు గుర్తించుకోలేడు సరికదా పైవారి కరుణా స్వభావాన్ని అర్థిస్తాడు. సంఘం వాఁడికీ, వాడి బంధువులకీ ఉపకారం చేయాలని ఆకాంక్షిస్తాడు. వాఁడికి గలిగిన విషాదాన్నే గుర్తించుకోగలఁడు. ఇతరుల బాధామయగాథలను గూర్చి విచారించే శక్తి వాఁడికి అవగింజంత పరిమాణమైనా లేదు" అనుకుని ప్రకాశం మఱొకసారి గట్టిగా నవ్వి, ఉండిఉండి కలవరిస్తూ అలాగ కుర్చీలోనే ఎప్పుడో గాఢంగా నిద్రపోయేడు.

మఱునాఁడు ఉదయం ప్రకాశం ప్రశాంతంగా లేచేడు. అతని హృదయం తొలినాఁటికన్నా చాలా తేలిక అయింది. కారణం ఏమీ లేదు. తన భావాలు మారేయి. అతని దృక్పథం వేఱయింది. అందరూ తెలిసికూడా ఆచరించని ఒక నగ్నసత్యాన్ని మనస్ఫూర్తిగా ఆచరించ సంకల్పించేడు. ఆ నిశ్చయంతో రక్తకాంతులను స్ఫుటీకరించే ప్రకాశం నయనాలు నిర్మలదయార్ద్రహృదయాన్ని ప్రతిబింబించే అద్దాలుగా మారేయి. అతని మొగంలోనూ, ప్రవర్తనలోనూ, భావాల్లోనూ విపరీతమైన పరిణామము గోచరించింది.

2

ఆరోజు మొదలు ప్రకాశం ఒక చిదానందమూర్తిగా మారేడు.

యుద్ధంనుండి రాఁగానే తనతల్లికి తగినమందులు ఇప్పించకుండా డబ్బు కొట్టేశారని యిరుగుపొరుగుల వారిని నిష్ఠురములాడేడు. ప్రాణం పూర్తిగా పోకమునుపే ఆమెను శ్మశానానికి తీసుకుపోయేరని మాధవరావు చెప్పే వారందరినీ కర్ణకఠోరంగా తూలనాడేడు. కాని యీనాఁడు వారందఱను క్షమార్పణ కోరుకుని వారికి అవసరసమయాల్లో సహాయం చేస్తూ మిత్రుఁడయేడు.

ఆనాఁడు సంఘాన్ని ద్వేషించిన ప్రకాశం, సంఘంలో తన ఉనికిని గుర్తించుకుని ఎదుటవారికి పరుషంగావుండే ఒక్కమాటను కూడా నోటినుండి జార్చుట మానేడు.

ప్రకాశం యుద్ధంలో చేసిన దారుణకృత్యాలనన్నీ మఱచిపోవాలని విశ్వప్రయత్నం చేసున్నాడు. కాని ఇంట్లో ఏకాంతంగా ఉండటంచేత కాలక్షేపం ఏమీ ఉండేదికాదు. ఎంతసేపని చదువుకుని కాలం గడుపఁగలఁడు?

ఒక్క నిమిషం తీరికగా వాలుకుర్చీలో కూర్చుంటే చాలు, తను పరమపాపినని నిరూపించే సంఘటనలు పరంపరలుగా జ్ఞప్తికివచ్చేవి. అందుకే ఇఁక అతను ఒంటరిగా ఇంటిలో ఉండలేనని నిశ్చయించుకున్నాడు. రెండవవ్యక్తి అగత్యం అతనికి ఎంతైనా కన్పించింది.

కొలఁదికాలంలోనే ప్రకాశం లతామంజరిని తొలిసారిగా చూడటం సంభవించింది. ఒకసారి పనిమీద పట్నంవెళ్ళి కాఫీహోటల్లో ఉప్మా తింటున్నాడు. ఆమె తనకెదురుగా కుర్చీలో కూర్చుని ఓవల్ టైన్ త్రాగుతూంది. అనుకోకుండానే ప్రకాశం లతవదనంలోకి దీక్షగా ఒకసారి చూసేడు. తరువాత అతనికన్నులను ఆమెనుండి మఱల్చలేకపోయేడు. ఆమె ఉండీ ఉడిగీ అతనివైపు చూస్తూ ప్రకాశం ఇంకా తననే చూస్తున్నాడని గుర్తించి యించుక తలవంచుకున్నది.

ప్రకాశం ముందూ లత వెనుకా హోటలుద్వారం ప్రవేశించేరు. ప్రకాశం పైకాన్ని చెల్లించాలని పట్లాం జేబులో చెయ్యిపెట్టేడు. కాని ఎంతకీ జేబుయొక్క అంతు దొరకలేదు. అతను బిత్తరపోయేడు. ఒకచోరాగ్రేసరుఁడు జేబును కత్తిరించి తన పర్సును చేఁజిక్కించుకున్నాడు. పైకాన్ని ఎలా చెల్లించాలో ప్రకాశానికి తోచిందికాదు. లత ఈ సంగతిని తెలుసుకుని ప్రకాశం చెల్లించవలసిన పైకాన్నికూడా మొత్తంగా చెల్లించింది.

ప్రకాశం సంతోషించి లతామంజరికి లెక్కలేని ధన్యవాదాలను చెప్పేడు. "దయచేసి మీ ఇంటి విలాసాన్నియిస్తే పైకాన్ని తిరిగి మీకుయిచ్చేస్తాన"ని ఆమెకు చెప్పేడు.

కాని లత నిరాకరిస్తూ తల పంకించింది. "మానవులు ఒకరికొకరు వీలునుబట్టి సహాయం చేసికోటం భావ్యం. కాని నేను నావలన అవగింజంత సహాయాన్ని పొందినంతలో వెంటనే బాకీ చెల్లించివేయాలని మీరు యోచించటం అంత భావ్యంగా కనుపించదు" అంటూ ముఖపద్మాన్ని ఆచ్ఛాదింపఁజూచే ముంగురులను చేత్తో ఒకసారి సవరించుకుంది. ప్రకాశం ఆమెకు లొంగిపోయేడు.

3

పట్నానికి ప్రయాణం అంటే చిరాకుపడే ప్రకాశం, వారానికి రెండురోజులైనా పట్నానికి బయలుదేరకుండా ఉండలేక పోతున్నాడు.

అథమం రెండుమూఁడు సార్లయినా పట్నం వెళ్తేనే గాని లత ప్రకాశానికి అగుపించేదే కాదు.

ఏ బజారుదగ్గరో పాఠశాల మార్గంలోనో కనుపించినా ప్రకాశంతో చాలా ముభావంగా మాట్లాడేది.

ప్రకాశం లతను ప్రేమించేడు కాని లత హృదయంలో తనకు స్థానం ఉందో లేదో ఇంకా అతను తేల్చుకో లేదు.

ఆ అవకాశం ప్రకాశానికి అచిరకాలంలోనే లభ్యమయింది. ఒకనాఁడు సాయంత్రం ప్రకాశం లతను కలుసుకున్నాడు. ఆ నాఁడు ఆమె చాలా ఉల్లాసంగా కనుపించింది. కాదనకుండా కోరినట్లు సముద్రతీరానికి ప్రకాశంతో వచ్చింది. సముద్రతీరాన్ని గల యిసుక తిన్నెపై ఉభయులూ తరఁగల విలాసాలను విలోకిస్తూ కొంతకాలం గడిపేక ప్రకాశం లతను మాట్లాడించాలని ఇలా అన్నాడు.

"నేఁడు నువ్వు చాలా ఆహ్లాదంగా కనుపిస్తున్నావు."

"మీరు అన్నది నిజమే! నిన్నటితో మా పరీక్షలు పరిసమాప్తి అయేయి. నేఁడు నా మనసు కట్లు విప్పిన కురంగము లాగుంది. పిక్నిక్కి పోవాలని ఉబలాటపడుతున్నాను. ఇంతలో మీరు పిల్చేరు." ప్రకాశం ఊహించింది సత్యమేనని లత ఒప్పుకుంది.

క్రమంగా సంభాషణ ప్రకాశానికి అనుకూలంగా జరిగింది. ప్రకాశం లలితంగా తన హృదయాన్ని లతకు నివేదించేడు.

లత ప్రకాశం అభ్యర్థనకు అంగీకారాన్ని గాని నిరాకరణనుగాని తెలుపలేదు. విప్పారిన కన్నులతో అతని వక్షస్థలాన్ని ఒకసారి చూసింది. తామరరేకుల వంటి ఆమె విశాలనయనాలలోని సొగసు అతన్ని ఉఱ్ఱూతలూపింది. లత హృదయంలో మాలతి మెదలింది.

మాలతి రెండేండ్లు భర్తతో కాపురం చేసింది. ఇంతలో అతను మరణించేడు. ఆమె విధవ అయింది. కాని మాలతి యింకా నిండు యౌవనముతో ఆకర్షణీయంగా ఉంది. శిల్పులను కూడా మోహింపఁజేయఁగల సౌదర్యం ఆమెది. పాపం! ఆమెలో హెచ్చరిక ఆ మూలాగ్రంగా నశించింది. ఆమె యొక్క దుర్భర స్థితిని తల్లిదండ్రులు చూసి సహించలేక పోయేరు వారు మాలతికి మళ్ళీ పెళ్ళి చేసేరు. ఆ నూతన దంపతులకు లేక లేక ఒక కూతురు జన్మించింది. ఆ పిల్ల గారాబంగా పెరిగి పుష్పవతియై అపురూప సౌదర్యముతో శోభిల్లుతూంది. ఆమెయే లతా మంజరి. ప్రకాశం హృదయాన్ని లాగికొన్న జాణ. లత ఈ విషయాన్ని ప్రకాశానికి చెప్పేసి తన హృదయాన్ని తేలిక చేసుకుంది. "నన్ను మీరు ప్రేమిస్తున్నారు. అందుకు నా పుట్టుపూర్వోత్తరాలు మీకు చెప్పటానికి నిశ్చయించి అలాగ చేసేను. ఇప్పుడు మీరు నన్ను ప్రేమించగలుతారో లేదో మరొకసారి పరిశీలించుకోండి!" అని అతణ్ణి హెచ్చరించింది.

ప్రకాశం "పాపం! మాలతికి ఒక మగపిల్లవాఁడు కూడా పుట్టి ఉంటే ఎంత బాగుండును!" అన్నాడు.

విశాల సముద్రంలోగల అనంతమైన నీరమునుండి వీచే చల్లనిగాలులు సైకత ప్రదేశమున ఆసీనులైనవారికి మిక్కిలి ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయి. నీలాకాశంలో పున్నమిచంద్రుడు శోభాయమానంగా వెలిఁగిపోతూ కడలిరాజును ఆనందంలో ఉప్పొంగిస్తున్నాడు.

లతకు ఇంకా ఇంటికి పోవాలని బుద్ధిపుట్టలేదు. ప్రకాశంతో తన విషయాన్ని కొంచెంసేపు ప్రస్తావించాలనిపించింది.

ప్రకాశందూరంనుంచి వస్తూన్న పొగఓడను తదేకధ్యానంలో పరికిస్తున్నాడు.

"నా కథను మీరు విన్నారు, కాఁబట్టి ఇటుపైని నన్ను ప్రేమించరనుకుంటాను"—లత ప్రకాశాన్ని మళ్లీ ప్రస్తావనలోకి దింపింది.

"విన్నాను!" అన్నాడు ప్రకాశం. "ఇప్పుడు నీలో ఉన్న సత్యం నన్ను పూర్వంకంటె వేయిరెట్లు అధికంగా ఆకర్షిస్తూంది. ఇప్పటివరకూ సౌందర్యవతివనే నిన్ను ప్రేమించేను. కాని నేఁడు మూర్తీభవించిన సత్యానివని తెలుసుకుని ఇంకా ఎక్కువగా ప్రేమిస్తున్నాను."

ప్రకాశం పెదవులపై ప్రకాశవంతమైన చిరునవ్వు వెలిగింది.

లత మరేమీ మాట్లాడలేదు.

కొద్దినిమిషాలు గడిచేక మళ్లీ ఆమె ప్రక్కకు మొగాన్ని త్రిప్పుకుని ప్రకాశం మెల్లిగా అడిగేడు "లతా! ఇంతకూ, నువ్వు నన్ను వివాహం చేసుకునేందుకు అంగీకస్తావా?"

ఆమె తన తలను ప్రకాశం ఒడిలోకి వాల్చింది.

4

సంతోష సంతాప సమ్మిళితమైనది సంసారం. ఆ మహాసాగర గర్భంలో ఒకనాడు ఆనందం కలుగు

తుంది. మరొకరోజు దుర్భరమైన వేదన అనుభూతమవుతుంది.

యుద్ధంనుండి తిరిగి వచ్చేక రెండుసంవత్సరాలు ప్రకాశం పొందిన వ్యాకులతగృహస్థుఁడు కావటంతోనే వెన్నెలగామారింది ప్రకాశం ఐదు సంవత్సరాలుఐదు నిమిషాల్లా గడిపేరు.

సరిగా ఐదుఏండ్లు ప్రకాశం పటాలములో మానవ విధ్వంసక్రియలయందు మునిగి గడిపేడు.

అలాగే ఐదుఏండ్లు మానవత్వానికి ప్రత్యేకత నాపాదించే ప్రేమకు దాసుఁడై గడిపేడు.

ఈనాఁడు ప్రకాశం వాలుకుర్చీమీద పఁడుకొని శోభాయమానంగా వెలిఁగిపోతూవున్న గగనవీధిలోకి అవలోకిస్తూ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. లత దగ్గరగా కూర్చుంది. ప్రకాశం మిక్కిలి ఉల్లాసంతో నిండుచందురుని కన్నులారా చూస్తున్నాడు. కొన్ని నిముషములు ప్రశాంతంగా గడిచెయి. ఇంతవరకూ ఉభయులూ ఆచరించిన మౌనవ్రతం లతకు విసుగుగొల్పింది.

“పూర్ణేందుఁడు తను అనుభవిస్తూవున్న ఆనందంతో సంతృప్తిఁబొందలేడు. పుచ్చపువ్వులాఁటి వెన్నెలను వసుంధరకు కానుకఁగా సమర్పించి ఆమెను పరవశంచేస్తాడు. అతను పరోపకారి” నిశాకరుని తన సన్నని పొడుగైన వ్రేలితో ప్రకాశానికి చూపిస్తూ అన్నది లత.

ప్రకాశం నవ్వుకున్నాడు. కొన్ని సెకనులు ఊరుకుని దగరగావున్న మల్లెతుప్పలవైపు లతి మొగాన్ని తన చేతులతో త్రిప్పి అన్నాడు. “విరఁగఁబూసిన మల్లెపూల సౌరభాన్ని మారుతుఁడు గైకొనివచ్చి మనకు ఉల్లాసాన్ని కల్గిస్తున్నాడు, అతనూ పరోపకారే.”

“అక్కడ ఊగుతూఉన్న ఊయలలో అబ్బాయిని చూడండి. వాఁడుకూడా మన ఇద్దరకూ ఉల్లాసాన్ని కలిగిస్తున్నాడు. వాఁడు పరోపకారి కాడా! మరి?” అని ప్రకాశాన్ని ప్రశ్నించింది లత ఊరుకోకుండా.

అప్పుడే ఊయలలో బాబు కదిలేడు. లత లేచి వెళ్లి ఉయ్యాలనుండి బాబునితీసి రెండువెపులా బుగ్గలమీఁద ముద్దులుపెట్టుకుని లోనికి తీసుకువెళ్ళింది. ప్రకాశం ఆమెను అనుసరించేడు.

“ఎల్లుండి బాబు పుట్టినదినం!” ఆనందంతో లత బాబుని మంచంమీద పరుండబెట్టి జోకొడుతూ ఆ నాటి రాత్రి ఒక మహాపర్వదినాన్ని జ్ఞప్తికి తెచ్చింది.

ఔను. అప్పుడే మనబాబుకి రేపటికి ఏడాది నిండుతుందని ప్రకాశం లయ వేసేడు.

మరి మీకు చాలాపనుంది. ఎప్పుడు చేస్తారని లత ప్రకాశాన్ని ప్రశ్నించింది.

“ఏమిటది?” ప్రకాశం తెలుసుకోగోరేడు.

“బజారుకు వెళ్ళటం ... బాబుకి రెండుజతలు మంచి దుస్తులు కొనటం.”

“కొనటం...” ప్రకాశం తాను జాగ్రత్తగా వింటూ ఉన్నట్లు లతకు తెలియాలని కొసముక్క తిరిగి ఉచ్చరించేడు.

తరువాత మూడువందలు లడ్డూ తేవాలి. శెనగలు పదిశేర్లు పట్రండి—నలుగురినీ పిల్చి వాయనాలివ్వాలి.

ప్రకాశం తలమీద చెయ్యి పెట్టుకొని దీర్ఘంగా ఒక పెద్ద నిట్టూర్పును విడిచేడు. ఆ నిమిషంలో లత పొందుతూన్న ఆనందం తనకు అనుభూతి కాలేదు—సరికదా కొంచెం చిఱచిఱలాడేడు.

లత కొంచెం కంగారుపడ్డది. ఆమె మొదట ప్రకాశంకి శరీరంలో బాగులేదేమో అనుకుని ‘తల నొప్పిగా వుందా?’ అని జాలిగా అడిగింది.

“అదికాదు లతా! నువ్వు చెప్పినట్లు చెయ్యటానికి నా మనసు అంగీకరించదు. ఈ విషయాన్ని చెప్తే నువ్వు నొచ్చుకుంటావు.” అన్నాడు ప్రకాశం.

“నాకు మీ వుద్దేశం అవగతమవలేదు ప్రకాశ్! నాకు తోచినవిషయాన్ని మీకు చెప్పేను. తద్భిన్నంగా మీరు ఏది చెప్పినా కాదనే స్వభావం కాదు నాది.” ప్రకాశం అంగీకరించని ఏ కార్యాన్నీ తను తలపెట్టనని నూటిగా చెప్పింది లత!

ప్రకాశం వదనం తిరిగి ప్రకాశవంతమైంది. “అలాగయితే రేపు పదిమందికి సరిపడే భోజనాన్ని నీ స్వహస్తాలతో వండు. ఎక్కడికి పోయినా తిండి దొరకని అసంఖ్యాక నిర్భాగ్యులలో అగుపడ్డ పదిమందిని పిలుస్తాను. వారికి కడుపునిండా అన్నదానము చెయ్యి. బాబుకి క్రొత్తబట్టలను కొనితేస్తాను. ఉదయమే నీళ్ళుపోసి వాఁడికి తొడుగు. బాబు చేత్తో ఒక్కొక్కడికి రూపాయి దక్షిణను ఇప్పించు. నా దృష్టిలో అదే మహోత్సవం.”

వ్రకాశం లతకు పురమాయించేడు.

లత ఒక్కసారి చలించింది. ఆనాఁడు అంత స్వల్పకాలంలోనే ఆమె ఎటువంటి భావాలను పొందిందో ఊహించటం కష్టం. ఆమె ప్రకాశం ఉద్బోధించింది ఆదర్శప్రాయంగా గుర్తించింది. మారు మాటనకుండా “అలాగే!” అని తల ఊపింది.

ప్రకాశం లత తన కోర్కకు విరుద్ధంగా ఉన్న ఆజ్ఞను శిరసావహించినందుకు చాలా సంతోషిం

చేడు. అంతేకాదు వివశుడై ఆమెను బాహాటంగా ప్రశంసించేడు కూడా.

“లతా! నువ్వు నామాటను కాదనవు. నీకు ధర్మమన్నా సత్యమన్నా మిక్కిలి మక్కువ. నువ్వు ఉన్నతాదర్శాలను చాలా సులువుగా గ్రహించగలవు, అందుకే నువ్వు నా జీవితానికి......”

ఇంక ప్రకాశం ప్రశంసలు లత వినదల్చుకోలేదు. నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోయింది.

5

చంద్రుడు వినువీధిలో కాంతులు విరజిమ్ముతూ ఆనందిస్తూ ఉంటాడు. భూదేవి అతని ఆనందాన్ని పంచుకుని ప్రకాశిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా కారుమేఘాలు ఉభయులనూ వేరుచేస్తాయి. ఆ తరుణంలో భూదేవి బ్రతుకు అంధకారమవుతుంది. మానవ జీవితంకూడా అచ్చంగా ఇలాగే ఉంటుంది. చీకటి వెలుతురు ప్రకృతిలో నిబిడీకృతం చేసేడు ఈశ్వరుడు.

లతామంజరి అకస్మాత్తుగా చనిపోవటంతోనే ప్రకాశానికి పృథ్వి అంతా చందమామలేని యామిని లాగ కారుచీకటి అయింది. ఆమె చనిపోతుందని ఆఖరువరకూ ఎవరూ అనుకోలేదు. లత ఒక కుమారెను ప్రసవించింది. ప్రకాశం హృదయంలో ఆనందం చిందులు త్రొక్కింది.

రెండుగంటలు బ్రతికి శిశువుపోయింది.

తండ్రి హృదయం తడిసింది.

మఱునాడు జ్వరంతగిలి లతకూడా తన జన్మను చాలించింది. ఇప్పుడు ప్రకాశం హృదయం ఏకంగా బీటలు వారింది. అతని కాళ్ళక్రింద భూమి కంపించింది.

పాపం!...ప్రకాశం “నేను ఎందుకు మిగిలి ఉన్నాను?”

బాబు కూడా బ్రతికి ఉన్నాడు. అప్పటికి సుమారు ఏడేండ్ల వాడు.

ప్రకాశానికి తన ఇల్లు నరకమయింది. శీతాంశుడు శత్రు వయ్యేడు

బాబుకి లత ఎక్కడికి పోయిందా! అన్న సందేహం కలిగింది.

ప్రకాశం హృదయవిదారకంగా శోకిస్తున్నాడు.

బాబుకి నాన్న ఎందుకు ఏడుస్తున్నాడో అర్థం కాలేదు.

లతకు ఈసంగతిని చెప్పాలని ఇల్లంతా గాలించేడు. ఆమె కనుపించలేదు. బాబు “అమ్మా! నీకు చెముడేమిటే?” అని గట్టిగా అరిచేడు. ఇల్లంతా ఆధ్వనితో మారు మ్రోగింది.

ప్రకాశానికి వెర్రి ఎత్తింది. గబగబ వచ్చి వాడిని చావమోదేడు. బాబు వెక్కి వెక్కి ఏడ్వనారంభించేడు. బాబుని ఇప్పటిదాకా ఎవరూ కొట్టలేదు. నేడు ప్రప్రథమంగా ప్రకాశం బాబుమీద చెయ్యి చేసుకున్నాడు. బాబు గోడమూలకు పోయి ఏడుస్తున్నాడు.

ప్రకాశానికి బాబు ఏడుపు వినబడటం లేదు. లత ఉంటేనే అతను మనిషి. నేడులత లేదు.

ప్రకాశానికి మరి ఇంట్లో ఉండ బుద్ధి వెయ్యలేదు. నిప్పు చేసుకుని ఇంతివండుకున్నాడు, కడుపులోని ఆకటి మంటలను కాస్త ఉడికీ ఉడకని మెతుకులు తిని చల్లార్చుకున్నాడు. అతనికి భోంచేశాక గాని బాబు సంగతి స్ఫురణకి రాలేదు. ప్రకాశం బాబుకి ఇంత అన్నం తినిపించబోయేడు. బాబు అతని చేతిని నోటినుండి త్రోసివేసి గోలుగోలున ఏడుస్తున్నాడు. “అమ్మని పిలవండి!” అని గట్టిగా కేక వేసేడు.

ప్రకాశానికి మళ్ళీ హృదయం గాయపడింది. అతనికి లత జ్ఞాపకం వచ్చింది. తిరిగి ప్రపంచం చీకటయింది. బాబును చెంపమీద సాగదీసి ఒక్కటి కొట్టి వెనుదిరిగి చూడకుండా వీధితలుపు గడియ వేసి బయలుదేరేడు. ప్రకాశానికి ఎక్కడికి పోవాలో తోచలేదు. అలా నడిచిపోతున్నాడు. దారిలో మాధవరావు అతణ్ణి పరామర్శించేడు. ప్రకాశం మళ్ళీ ఏడ్చేడు.

మాధవరావు పానప్రియుడు. పానం పరితాప నాశనం అనే మూలమంత్రాన్ని అవ్యక్తి తైలధారగా జపిస్తాడు. ప్రకాశంలాగే అతనుకూడా కష్టాలుపడ్డవాడే. ఒకనాడు మాధవరావు పెద్దకుటుంబంలో ఉండేవాడు. నేడు సారాబుడ్డితోమాత్రమే ఉంటున్నాడు. దారీతెన్నూ కాంచలేని ప్రకాశంకి మాధవరావు మారదర్శి అయేడు. ఆనాడు ప్రకాశం మాధవరావుతో కూడా ఒకింత సారా త్రాగేడు.

రాత్రి పన్నెండు గంటలయింది. ప్రకాశం వీధి తలుపు తోసుకుని ఇంట్లోకి వచ్చేడు. అతనికి ఆశ్చర్యాన్ని కల్గించే దృశ్యంఒకటి కన్పించింది.

ఇంట్లో దీపం వెలుగుతూంది.

చిందరవందరగా ఉండవలసిన సామగ్రి స్వస్థానాన్ని సంపాదించింది.

ఎవరో ఒకయువతి బాబును జోకొడుతూ నిద్ర గొల్పుతూంది.

ఆ సుందరి ప్రకాశంరాగానే నిలబడింది.

“నువ్వెందుకు ఆ నిర్భాగ్యునిగూర్చి శ్రమ పడుతున్నావు?” ప్రకాశం ఆమెను నిరుత్సాహ పరిచేడు.

ఆమెలో విషాదచ్ఛాయలు స్పష్టంగా కనిపించేయి. "ఒక ఆదర్శమూర్తి సువిశాలమైన భూదేవికి సమర్పించిన కానుకగా బాబుని నేభావిస్తున్నాను. ప్రకాశ్! నాలో ఉన్న ప్రేమను యావత్తూ వీడు స్వాధీనం చేసుకున్నాడు." అని ఎంతో జాలిగా ఆమె పలికింది.

ప్రకాశం ఆమె ముఖంలోకి చూసేడు. ఆమె కళ్ళ వెంట నీరు కారుతూంది. లతమరణం ఆమెకుకూడా దుఃఖాన్ని కల్గించింది.

మానవజీవితమంతా సుఖమయం కాదు ప్రకాశ్! సుఖాలాగే కష్టాలుకూడా జీవితంలో వస్తూఉంటాయి. సుఖాల్లో ఆనందించేశక్తి ప్రతీవాఁడూ కలిఉంటాడు. కాని కష్టాల్లో చలించకుండా వున్నవాఁడే ధన్యుఁడు. అందుచేత మీరు ధైర్యం వహించాలి. బాబుని పెంచి పెద్దచేయాలి. ఆపని చేస్తేనే మీరు లతకు సేవచేసినవారవుతారు. వణికే గొంతుకతో ఆమె ప్రకాశాన్ని హెచ్చరిక చేసింది.

ప్రకాశం వికారంగా నవ్వుతూ "ఎందుకూ! నేనూ చచ్చిపోతాను. బాబూ చస్తాడు. మేం ఇద్దరం చస్తేనే లతకు ఆత్మశాంతి చేకూరుతుంది" అన్నాడు.

ఆమె మరేమీ మాట్లాడలేకపోయింది. పోత పోసిన బొమ్మలాగా అలాగే నిల్చుంది. ప్రకాశం ఆమెను దీక్షగా చూస్తున్నాడు. ఆమె ముఖంలో ఏదో దివ్యశక్తి తాండవిస్తున్నట్లు అతనికి కన్పించింది. ఇంత దుఃఖంలోనూ ప్రకాశానికి ఒక శాంతి కల్గింది. ఆమెవైపే చూస్తూ తన దుఃఖాన్ని మరచిపోగలనేమో అనుకున్నాడు ఒకసారి.

బాబు కదిలేడు. ఆమె మళ్ళీ కూర్చుని తల వంచుకు బాబుని జోకొడుతూంది. ఆమె బాబుకి సేవ చేస్తూంది. ప్రకాశం ఆ జవ్వని మాతృప్రేమను మదిలో ప్రశంసించేడు. ఒకవేళ బాబు పెరిగి పెద్దవాఁడవాలంటే ఆమె ఉండాలి. తను ఇప్పుడు బాబునేమి చేయఁగలఁడు? తను ఇప్పుడు వివేకాన్ని కోల్పోయేడు. ఆమె మాత్రం బాబుని ఎంతకాలం సంరక్షిస్తుంది. ఏదో నాల్గురోజులు. ఆమె మాత్రం పరిణయమాడదా? ఆమె అత్తవారింటికి పోతుంది. అప్పుడు బాబు ఏమౌతాడు. ప్రకాశం తన భావాలనే ఆమెకు చెప్పేడు.

"నువ్వు ఎంతకాలం బాబుకి పరిచర్య చేయఁగలవు?

"ఎంతకాలమైనా చేయఁగలను. బాబుకి నేనే లతను అనే భావన కలిగించేశక్తి నాకు లేకపోలేదు" దృఢంగా ఆమె సమాధానం చెప్పింది.

ప్రకాశం అపారమైన ఆశ్చర్యాన్ని పొందేడు. ఈమె చంపయేనా? ఎంత ధైర్యంగా నాలో ఆశాదీపాన్ని వెల్గిస్తూంది? నిజానికి ఈమె లతకు తగిన మిత్రురాలు అనుకొని ఆమెను వేరొక ప్రశ్న వేసేడు.

"రేపు నీకు వివాహమౌతుంది. నువ్వు అత్తవారింటికి పోతావు. అప్పుడు బాబు ఏమౌతాడు."

"నేను లతస్థానాన్ని వహిస్తాను."

ప్రకాశం పరమానంద భరితుఁడయేడు.

"చంపా! నువ్వు నన్ను వివాహ మాడగలవా?" ఆమెను అడిగేడు.

చంప తల వాల్చింది.

ప్రకాశం రెండడుగులు ముందుకు వేసేడు. చటుక్కున లత అతనికి స్ఫురించింది.

"నేను లతను ఎలా మరచిపోగలను చంపా?"

దీనంగా అతను చంపను చూస్తూ అన్నాడు.

"నేను మాత్రం మరిచిపోగలనా ప్రకాశ్! మనం ఇరువురం ఆమెను పూజిద్దాం. ఆమెకు సర్వస్వం అయిన ఈ అర్భకునికి రెక్కలనిద్దాం. ఆనాఁడు మీకు లతయందుగల ప్రేమ నాకు ఆమెయెడలగల పూజ్యభావం రెండూ సార్థకమౌతాయి."

ప్రకాశంహృదయంలో ఒక ఆశాజ్యోతి వెల్గింది.

చంప ప్రకాశం ఇంటికి నాల్గిళ్లు అవతలగల గంగమ్మగారి ఏకైకపుత్రి. ఆమె వయస్సు సుమారు పదునెనిమిది సంవత్సరాలు. చంప చాలా చక్కగా ఉంటుంది. చంప తండ్రిని ప్రకాశం బాగా ఎరుగును. అతను యుద్ధంలో తన ప్రాణాన్ని కోల్పోయేడు.

చంప ఆ నాటికి తను ఇంటికి వెళ్ళటానికి అంగీకారాన్ని అర్థించింది.

"బాబుకి అన్నం తినిపించేను. ఇఁక తెల్లవారే దాకా లేవడు. ఒకవేళ ఎప్పుడైనా కదలితే కాస్త బుజ్జగించండి. ఇదుగో! ఇలా చూడండి! వాఁడిపై మీరు కోపం ప్రదర్శించడానికి వీల్లేదు. ప్రొద్దున్నే కాఫీ పట్టుకువస్తాను. మా అమ్మకూడా వస్తానంది. ఈ రెండు ముక్కలూ ప్రకాశానికి చెప్పి మెల్లిగా ద్వారంవైపు నడిచింది."

తలుపు గడియ వేసుకుందికి చంప ననుసరించిన ప్రకాశం నోఁటినుండి ఒకవాసన చంపకు తగిలింది. ఆమె క్షణకాలం జలదరించి గబగబా ఆ అర్ధరాత్రి ఇంటికి చేరుకుంది.

ప్రకాశం ఆ రోజు మాధవరావు ప్రోద్బలముపై చాలా కొంచెం సారా త్రాగేడు. రాత్రి అతనికి ఎంతకీ నిద్రరాలేదు. అప్పటికి కాలం రెండుగంటలయి ఉంటుంది. ప్రకాశానికి తల తిరుగుతూంది. ఏదో వాగుతేగాని అతనికి సౌఖ్యమనిపించలేదు. అతను పిచ్చి పిచ్చిగా మాట్లాడ నారంభించేడు.

ఒకసారి తన ధోరణిలో అతను తిట్టడం ప్రారంభించేడు. ఆమెను గాడిదఅనీ, కుక్క అనీ శతవిధాల తిట్టేడు. ఈ సారి ఆమె అగుపడితే చీల్చి చంపుతానన్నాడు. మరొకసారి తన వివాహమైన కొద్దికాలంలోనే మరణించిన లత తలిదండ్రులకు నమస్కరించేడు. కొద్దికాలం తరువాత వారు జబ్బుచేసి చావడం మంచిది కాదన్నాడు. ఈ సారి మీరు సముద్రంలోపడి చావండి అన్నాడు. ఈ విధంగా ప్రకాశం పూర్తిగా మతిని కోల్పోయి వాగేడు. పూర్తిగా మతిభ్రష్టుఁడయ్యేడు.

రాత్రి రెండున్నర గంటలయింది. ప్రకాశానికి యింకా పూర్తిగా తెలివిరాలేదు. కాని అతనిధోరణి తగ్గింది. కొంచెం కొంచెం నిద్రకూడా వస్తూంది.

ఇంతలో బాబుకి తెలివివచ్చింది, వాఁడు లేచి కూర్చుని అమ్మా! అంటూ ఏడ్వసాగేడు. ప్రకాశం లేచి తూలుతూ వెళ్ళి వాఁడికి రెండు చెంపలమీదా రెండు దెబ్బలు గట్టిగాకొట్టేడు. బాబు అమ్మా! అంటూ ఇంకా గట్టిగా ఏడుస్తున్నాడు. ఆ నిమిషంలో పసివాఁడైన బాబు ఎంతిగా బాధపడ్డాడో చెప్పలేం. వాఁడికి ఒక్కసారిగా అమ్మ కనుపించలేదు. నిన్నటివరకూ అమృతమూర్తిలాగున్న నాన్న నేడు ప్రచండ మార్తాండుఁడయేడు. అమ్మలాగే ఆదరించి బుజగించిన ప్రేమమూర్తి ఇల్లు చేరుకుంది. బాబు ఇంకా గట్టిగా ఏడుస్తున్నాడు. ప్రకాశం విసిగివాఁడిని జెనిపట్టుకు బయటకు గెంటి తలుపులోపల గడియ వేసుకొన్నాడు.

ఆనాఁటి రాత్రి ఆకసము మేఘావృతమై ఉంది. అందుచేత పృధ్వీతలంమీఁద చంద్రకాంతి మసక మసకగా పడుతూంది. ఆ చీఁకటిలో బాబు ఒకటే పరుగు తీసి తిన్నగా ఊరిబయటనున్న శివాలయం చేరుకున్నాడు.

దూరంనుండి నక్కల అరుపులు. వినిపిస్తున్నాయి. ఇంకా అనేక సద్దులు పెద్దవారినే భయపెట్టేలాగున్నాయి. కాని బాబుమాత్రం కొంచెమైనా చలించలేదు.

6

ప్రకాశానికి మూఁడుగంటలకు నిద్రపట్టింది. అది కూడా కలతనిద్ర. ఆ నిద్రలో ఒకకల.

లతామంజరి తెల్లనిచీర కట్టుకుంది. ఆమెనొసట కుంకుమబొట్టు నింగిలో చందమామలాగ తళతళ లాడుతూంది. లత కబరీభారంలో మరువాన్ని తురిమింది. సలక్షణంగా చేతితో పూలసజ్జను పట్టుకుంది. మరొక చేతో బాబుచెయ్యి పట్టుకుంది. ఇద్దరూ శివాలయం చేరేరు. లత ఈశ్వరలింగాన్ని అవలోకించి మధురమైన పాటపాడింది. ఆ పాటకు ఈశ్వరుఁడు పరవశుఁడై ఒకసారి మనోహరంగా నవ్వేడు. బాబుచుట్టూ రాఉన్న పూలమొక్కలనుండి పుష్పాలనుకోసి తెచ్చేడు. లత నవ్విన భగవానుని పూలతో పూజించింది. మధురతర పక్వ ఫలములను నివేదించింది. బాబు ఈశ్వరునికి సాగిలఁబడి నమస్కరించేడు.

ప్రకాశం కలలో రెండవదృశ్యం మొదలైంది.

ఒకసారి బాబు బడికివెళ్ళేడు. తన ప్రక్కనున్న కుర్రవాడిని చూసేడు. వాఁడు చొక్కా తొడుక్కోలేదు. బాబు వాఁడిని కారణం అడిగేడు. వాఁడు తనకు ఒకటేచొక్కా ఉందన్నాడు. అది చాకలికి వేయుటచేత తిరిగి వచ్చేవరకు తనకు తొడుక్కుందికి వేఱు చొక్కా లేదని చెప్పేడు. బాబు మరేమీ మాట్లాడకుండా తన చొక్కాను తీసి వాఁడికి ఇచ్చేడు. ఆ చొక్కా వాఁడు తొడుక్కునేవరకూ ఊరుకోలేదు. బాబు ఉట్టి బనియనుతోనే ఇంటికి రావడంచూసి లత విపరీతపడి మెల్లిగా బాబునడిగి సంగతిని తెలుసుకుంది. బాబుని అంత హద్దుమీరి దానాలను చెయ్యడానికి ఇంకా మనకు శక్తి రాలేదనీ, ఈశ్వరుఁడు మనకు సంపదలను కటాక్షించిననాఁడు మనం మానవసేవ తప్పక చేయాలని మందలిస్తూ నీతి గరిపింది. "నువ్వు పెద్దవాఁడవౌతావు. నీకు పెద్ద ఉద్యోగం దొరుకుతుంది. అపుడు నీ జీతంలో సగంపాలు దాన ధర్మాలకు వినియోగించాలి. తెలిసిందా!..." అన్నది. లత బాబుచేసిన పనికి కినుక వహించిందా?...లేదు. ఆమె మొదట బాబును మెలిగా మందలించింది. తరువాత ప్రాజ్ఞుఁడయిన పిదప కర్తవ్యాన్ని బోధించింది.

ప్రకాశం స్వప్నసీమలో బాబు ఆఖరిసారిగా కనిపించేడు. లత వాఁడికి రెండు జేబులలోనూ రెండు పిడికిళ్ళు బియ్యంపోసి బడికి పంపుతుంది. ఆ బియ్యాన్ని వాఁడు శివాలయం దగ్గరున్న బిచ్చగాళ్ళకు వేసి మరీ, బడికివెళ్ళాడు. అక్కడ ఉండే ఇద్దరు బిచ్చగాళ్ళూ బాబు అంటేపడిచస్తారు. అవకాశం దొరుకుతే ఒకసారి ఎత్తుకుని ముద్దులాడి దింపేసారు. "దరిద్రం ప్రేమను కొరత చేయఁగలదా?" అనుకుంటాడు కలలోనే ప్రకాశం.

మఱి బాబు ప్రకాశానికి కనిపించలేదు వెంటనే అతనికి తెలివి వచ్చింది. అతను బాబూ! అని గట్టిగా అరుస్తూ కలఁత నిద్రనుండి మేల్కొని ఇలు నలుమూలలా గాలించేడు. బాబు ఎక్కడా కన్పించడు. అతనికి నిన్నరాత్రి సంఘటన స్ఫురించింది. ప్రకాశం వీధిద్వారంవైపు పరిగత్తేడు.

అప్పుడే తెలతెలవారుతూంది. పెరటిలో ఉన్న వృక్షముల మీఁద పక్షులు ఒకటే గోలచేస్తున్నాయి. చంప మరచెంబు చేత్తో పట్టుకువస్తూంది.

వీధి తలుపుమీఁద టకటకమని శబ్దం—లోడనే ప్రకాశ్ అని ఒక కోకిలస్వరం. వీధితలుపు తియ్యాలనే ప్రయత్నంతో జోరుగా వస్తూఉన్న ప్రకాశానికి వినిపించేయి. అతను తలుపు తెరిచేడు.

"బాబు ఏడీ చంపా?" అని ప్రకాశం తలుపు తెరువగానే ఆమెను ప్రశ్నించేడు. ఆత్రుతతో ఆమెను త్రోసుకుని ముందుకుపోయి వీధిఅరుగు నాలుప్రక్కలా చూసేడు. చంప నిర్ఘాంతపోయింది. ఆమెకు ఏమీ బోధపడలేదు. ప్రకాశం నిన్నరాత్రి తను వివేచనను కోల్పోయి చేసిన ఘాతుకచర్యను శిథగద్గదస్వరంతో చంపకు చెప్పేడు. చంప ఆపాదమస్తకమూ కంపించింది. ఆమె చేతిలో మరచెంబు క్రిందకు విడిచింది.

ఇద్దరూ వీధినంతా గాలించేరు. వారికి బాబు కనుపించలేదు. ఆఖరికి చంపకు ఒక ఊహ తట్టింది. "బాబు శివాలయానికి పోయిఉంటాడు. చూదాం పద!" అంటూ ఆమె అటుప్రక్క పరువెత్తింది. ప్రకాశం కూడా పరువెత్తేడు.

ప్రకాశం, చంపా, శివాలయం చేరుకున్నారు. కోవెల కుడ్యాలనిండా వారికి "అమ్మ" అనే అక్షరాలు లెక్కలేనన్నిసార్లు కన్పించేయి. ఆ అక్షరాలు విభూతి ముక్కలతో వ్రాయఁబడి వున్నాయి. ఆ దస్తూరి బాబుదే! ఆ గోడలమీఁద వాఁడు కనీసం ఐదువేలసార్లు అమ్మ అనే పదాన్ని వ్రాసి ఉంటాడు. ఎంత ఓపికతో వ్రాసేడో కాని ఆ గోడలనిండా రెండున్నర అడుగుల ఎత్తువరకూ చుటూ అమ్మ అనే పదం ఎడంలేకుండా కనుపిస్తూంది. చంప ఆ అక్షరాలను చూస్తూ అలా స్తంభించిపోయింది.

ప్రకాశం ఆత్రుతతో లోనికిచొచ్చుకుపోయి చూసేడు. అక్కడ బాబు నందీశ్వరుని దగ్గరపడి ఉన్నాడు.

ప్రకాశం బాబూ! అని వాఁడిని కౌగలించుకుని లేవనెత్తేఁడు.

కాని బాబు ప్రాణం ప్రేమలేని యీ ప్రపంచం నుండి లతవున్న లోకానికి ఎగిరిపోయింది.

ప్రకాశం గట్టిగా విలపిస్తూ వాఁడిని భుజంమీఁద పడేసుకుని బయటకు వచ్చేడు. చంప ఆదృశ్యాన్ని మఱి చూడలేక చీరచెరఁగుతో కన్నులు మూసుకుని వలవల ఏడ్చింది.

లత చనిపోయింది. బాబు కూడా చనిపోయేడు. ప్రకాశం నిర్భాగ్యుడై బిగ్గరగా ఏడుస్తున్నాడు.

చంప మాత్రం అట్టేసేపు ఏడువలేదు. ఆమె తెలివి తెచ్చుకుని ఆఖరుసారిగా ప్రకాశానికి కొన్ని ముక్కలు చెప్పింది...

"నువ్వు దౌర్భాగ్యుఁడవు ప్రకాశ్! ఇఁక నేను ఏ విధమైన ఉపకారాన్నీ నీకు చేయలేను. లత ఆత్మశాంతి వాంఛించి నా జీవితాన్ని నీకు అంకితం చేయాలని నిశ్చయించేను. కాని...అప్పుడే సమయం దాటిపోయింది ఇప్పుడు ఆశ కి నాలో నశించింది. నా ఆశ నిరాశ అయింది. అంతే...నిన్ను మాత్రం నేను ఎన్నడూ ప్రేమించలేదు. ఇటుపై ప్రేమించలేను కూడా."

ప్రకాశానికి చంప నోటనుండి వచ్చిన మాటలు కశాఘాతాల్లాగ తగిలేయి. ఆమె మొగంలో ఒకశాంతం—ఒక గాంభీర్యం—ఒక ఉద్రేకం అతనికి గోచరించేయి. ఇంక అతను ఆమెవైపు చూడలేకపోయేడు. భూమ్యాకాశాలు కలిసేలాగ కన్పించే ప్రదేశాన్ని వ్యర్థంగా చూస్తూ రెండుఅడుగులు వేసేడు.

ప్రకాశ్! చంప అతణ్ణి పిలచింది. అతను వెనుకకి తిరగకుండా అక్కడనే కొంచెం ఆగేడు.

చంప అతని భుజాలనుండి బాబు శవాన్ని లాగుకుంది. రెండు బుగ్గలమీఁదా రెండుముద్దులు పెట్టుకుంది. నిండు యౌవనంతో తొణికిసలాడే తన హృదయానికి వాఁడి భౌతికశరీరాన్ని ఒకసారి హత్తుకుంది. తిరిగి బాబుని అతని భుజాలకు చేర్చి, "ఇక సెలవు!" అంటూ గబగబ నడిచిపోయింది.

ఆర్ష రసాయనశాల

ముక్త్యాల, (కృష్ణా)

(స్థాపితము 1925.)

ప్రశస్తాయుర్వేదౌపధముల నిలయము. ఏ మందు కావలసినను మాకు వ్రాయుడు. నమ్మకమైనవి లభింపగలవు.

ఆయుర్వేదభూషణ

వేటూరి శంకరశాస్త్రి,

ఎ. ఎం. ఎ. సి.

Consulting Physician